క్లుప్తంగా

మత్తు మహమ్మారిని తరిమేద్దాం

సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ షేక్ ఆసిఫ్



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మత్తు మహమ్మారిని తరిమేసే బాధ్యత మనందరిపై ఉందని సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ షేక్ ఆసిఫ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెరిడియన్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు బానిస కాకుండా, కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చర్చ



సదస్సులో పాల్గొన్న జిల్లా తపస్ ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో జిల్లా నుంచి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ప్రతినిధులు పాల్గొన్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి తెలిపారు. రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో జాతీయ విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జాతీయ నూతన విద్యా విధానం, సీపీఎస్ రద్దు, ప్రమోషన్లలో టెట్ మినహాయింపు, ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఎస్జీటీల ఓటు హక్కు, జీవో 317, విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

సీడీపీఓ జయప్రద



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ

బెజ్జంకి(సిద్దిపేట): గర్భిణులు పోషకాహారాన్ని తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ జయప్రద సూచించారు. పోషకాహార మాసోత్సవంలో భాగంగా బుధవారం బెజ్జంకి రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార విషయాలు వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగరాణి, కవిత, మెడికల్ ఆఫీసర్ నసీమున్నీసా, సులోచన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వామ్యం అవుదాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక క్రాంతి హై స్కూల్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ – 2025 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెత్త రహిత పట్టణంగా మార్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ ఎర్రచెరువు ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాదర్‌పుర, నాసర్‌పుర, ఎర్రచెరువు కట్ట, రాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీకి దారేది?



అంగన్‌వాడీ సెంటర్ చుట్టూ నిలిచిన బురదనీరు

- చుట్టూ బురదనీరు.. పేరుకుపోయిన పాకురు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- కంపు కొడుతున్న పరిసరాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): దారి పొడవున బురదనీరు.. ఆపై అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుస్థితి మండలంలోని రామవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో నెలకొంది. అయితే, ఈ దారి పొడవున బురద ఉండటంతో అందులోంచి చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నారని తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్ పేర్కొంటున్నారు. కొన్ని రోజులుగా కేంద్రం చుట్టూ నీరు చేరి ప్రస్తుతం కంపుకొడుతోంది. అలాగే పాకురు పట్టి ప్రమాదభరితంగా దర్శనమిస్తుంది. పాకురు పట్టడంతో చిన్నారులు జారి కింద పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికంగా మొరం మట్టి పోయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంగన్‌వాడీకి వచ్చే దారిలో నిలిచిన మురుగునీరు

సమస్యల వలయంలో ఓపెన్ జిమ్‌లు

- ఎల్లాయపల్లిలో బిగించని వ్యాయామ పరికరాలు
- పట్టించుకోని అధికారులు



ఎల్లాయపల్లిలో రెండేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న జిమ్ పరికరాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ గత ప్రభుత్వ హయాంలో బహిరంగ ప్రదేశాలు, పార్క్‌లలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. మండల పరిధిలోని ఎల్లాయపల్లిలో జిమ్ పరికరాలు వచ్చినా రెండేళ్లుగా వాటిని బిగించకపోవడంతో వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ తుప్పు పట్టిపోతున్నాయి. అలాగే పలు గ్రామాల్లో జిమ్‌ల పర్యవేక్షణ, నిర్వహణ కొరవడటంతో వ్యాయామ పరికరాలు దెబ్బతినడం, విడిభాగాలు ఊడిపోవడంతో పనికి రాకుండా పోయాయి. ఆశించిన లక్ష్యం నెరవేరక పోగా, వ్యాయామం చేయాలన్న వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎల్లాయపల్లిలోని జిమ్ పరికరాలు బిగించి ఇనియోగంలోకి తీసుకురావాలని, పలు గ్రామాల్లో వ్యాయామ పరికరాలను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలేవీ?



మార్కెట్‌లో మక్క రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులకు అండగా ఉండాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పత్తి మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు మక్క కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం సీజన్ ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.2400 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమిరెడ్డి, రమేశ్ గౌడ్ అరవింద్ రెడ్డి, ఆంజనేయులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం ఎల్కల్, బేగంపేట, దొడ్లపల్లి, వడ్డేపల్లి , సయ్యద్ నగర్, రామారం, వీరానగర్ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం వచ్చేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని తరగతుల వారీగా స్లిప్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ డీఈవోగా ఎంపికైన శ్రీనివాస్ రెడ్డిని వడ్డేపల్లి ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు యాదగిరి, స్వామి గౌడ్, ఎల్లా గౌడ్ పాల్గొన్నారు.

గతంలో రేషన్ కార్డులు ఇవ్వలేదు

కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

దౌల్తాబాద్ (దుబ్బాక): గత ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దార సత్యనారాయణ, దశరథ రెడ్డి, కర్నాల శ్రీనివాస్‌రావ్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ... యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం లేదని, సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతోనే భారం పడిందని, దాని వల్ల ప్రస్తుతం ఆరోగ్య సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆది, బాలకృష్ణ, దుద్దెడ స్వామి, మామిండ్ల స్వామి పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

సిద్దిపేటకమాన్: తెలంగాణలో బాల సాహిత్య ఉద్యమం నడుస్తుందని, ఇది రేపటి సమాజానికి శుభ సూచకమని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఉగాది బాలల కథల పోటీ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

18 మందికి జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ వివరాల ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 18 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా రూ.17,400 జరిమాన, వీరిలో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



మందులు తీసుకుంటున్న ప్రజలు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిటుకుల ప్రసాద్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి జ్ఞాపకార్థంగా ప్రజల కోసం లోహిత్‌సాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు 200 మందికి పైగా బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహిద్దాం

ధూళ్మిట్ట ఎంపీడీవో వీరరాజు



మాట్లాడుతున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా, అందరూ సహకరించాలని ధూళ్మిట్ట ఎంపీడీవో వీరరాజు, తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి, ఎస్‌ఐ షేక్ మహబూబ్, ఎంపీవో మాదవ్‌జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై అధికారులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల నియమావళిని పాటించి, ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర సమితి సభ్యురాలు, హుస్నాబాద్ మండల ఎన్నికల ఇన్‌చార్జి లక్కిరెడ్డి తిరుమల అన్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు సంపత్ నాయక్, నాయకులు రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్, మల్లయ్య, జయలక్ష్మి, శ్రీనివాస్, జైపాల్ రెడ్డి ఉన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



మండలంలోని చీకోడ్‌లో 8వ వార్డులో రోడ్డు చినుకు పడితే చిత్తడిలా మారుతుంది. దీంతో కాలనీకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకో లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయా లని కాలనీవాసులు కోరుతున్నారు.

– దుబ్బాకరూరల్

నేటి నుంచి నీటి సరఫరా బంద్

సిద్దిపేటజోన్: రిజర్వాయర్ పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని కొన్ని వార్డుల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 23, 24, 25, 26, 41వ వార్డుల్లో గురు, శుక్ర వారాల్లో నీటి సరఫరా ఉండదని, తిరిగి ఈనెల 11న యథావిధిగా ఉంటుందని తెలిపారు.

సుప్రీంకోర్టు సీజేఐపై దాడి హేయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మనువాద లాయర్ రాకేశ్ కిశోర్ దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, దీనిని ఖండిస్తున్నామని కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు అరకాల శ్రీకాంత్ అన్నారు. బుధవారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ.. 79 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో దళితులపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. లాయర్ రాకేశ్ కిశోర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. నాయకులు కరుణాకర్, బాల్‌రాజు, శ్రీశైలం, స్వామి ఉన్నారు.

సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తాం



తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డిని సన్మానిస్తున్న వివిధ పార్టీల నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో సాదాబైనామా సమస్యలకు పరిష్కారం తీసుకుంటున్నట్లు, ధూళ్మిట్ట మండల తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020 సంవత్సరం దరఖాస్తు చేసుకున్న 1275 సాదాబైనామాలకు సంబంధించిన అమ్మకందార్లు, కొనుగోలుదారులకు నోటీసులు అందించామన్నారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చంద్రారెడ్డి, లక్ష్మి, యాదగిరి, నాయకులు సాయి లు, జగన్, సుమన్, నర్సింహులు, అనిల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పని చేస్తున్న రోజు వారి వర్కర్లుగా పని చేస్తున్న కార్మికులకు టైం స్కేల్, తదితర సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగార్జున్, రాంప్రసాద్, రాజేందర్ చారి, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అలయ్ బలయ్



అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సిద్దిపేటజోన్: పట్టణంలోని కొండా భూదేవి గార్డెన్‌లో బుధవారం రాత్రి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అక్కన్నపేట: జనగామలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

అక్కన్నపేట(హుస్నాబాద్): దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే వరిధాన్యం విక్రయించాలని తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ అన్నారు. మండలంలోని జనగామ గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను తప్పకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్నీ సౌకర్యాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ఆర్‌ఐ యాదగిరి, ఐకేపీ సీసీలు తిరుపతి, శివ చరణ్, మహిళా సంఘాల సభ్యురాలు పాల్గొన్నారు.

తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దు..

హుస్నాబాద్ రూరల్: రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పోతారం(ఎస్)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం తిరుపతి, సీసీలు పాల్గొన్నారు.



బెజ్జంకి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం పర్శరాములు

సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం పర్శరాములు సూచించారు. బెజ్జంకి క్రాసింగ్, చిలాపూర్ గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. క్వింటాల్ ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2389, బీ గ్రేడ్‌కు రూ.2369 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ సారయ్య, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ రూరల్: పోతారం(ఎస్)లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు